క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. అమరవిల్లి, పొన్నాడలో ఉన్న ప్రభుత్వ లే అవుట్‌ల్లో జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల సాకారం చేసుకోవాలన్న ఆలోచనతో ప్రభుత్వం గృహ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతమిస్తోందన్నారు. లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


కొండెవరంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం


తుప్పుపట్టి పాడైన స్తంభం అడుగుభాగం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రోడ్డులోని విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇనుప స్తంభం కింది భాగం పూర్తిగా తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఏ సమయంలో స్తంభం కూలిపోతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షం కురిసే సమయంలో అటువైపు వెళ్లే సమయంలో షార్ట్ సర్క్యూట్ కూడా అవుతుందని చెబుతున్నారు. దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ ఎంపీని తక్షణమే అరెస్టు చేయాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: రెజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు గ్రామంలో మంగళవారం ఈ మేరకు రైతుకూలీలతో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, మునిలిబాబు, ఆదినారాయణ, శివాజి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెడ్పీటీసీల శిక్షణ


జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న రెండో బ్యాచ్ రెండవ రోజు శిక్షణ కొనసాగుతుంది. రెండవ రోజు జెడ్పీలో మౌలిక సదుపాయాలు, విద్య, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మహిళా శిశు సంక్షేమం, వైద్యం, ఆరోగ్యం, జల్‌జీవన్ మిషన్, నిధులు, ఆదాయాలు, ఖర్చులు వంటి అంశాలపై ఈటీసీ ఫ్యాకల్టీ ఆంజనేయులు, డీపీఓ విక్టర్, వ్యవసాయశాఖ జెడీ విజయకుమార్, పశు సంవర్ధక శాఖ జెడీ సూర్యప్రకాష్ గౌస్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, ప్యాకల్టీ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు రాబర్ట్ రాజ్


రాబర్ట్‌రాజ్‌కు కప్పు అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్న రేగుల రాబర్ట్‌రాజ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్.కొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లా శాంతినగర్‌లో రాయ్ చెస్ అకాడమిలో చెస్ కోచ్ లీలాకుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. మంగళవారం జరిగిన అండర్ 19 బాల, బాలికలు, అండర్ 9 కేటగిరిలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికలు జరిగాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాబర్ట్‌రాజ్ పాల్గొంటాడని హెచ్ఎం తెలిపారు.

విత్తన విక్రయానికీ లెక్కుంది

- అన్నదాతకు అండగా పటిష్ట చట్టం
- ఈ చట్టంపై అవగాహన అవసరం
- అప్పుడే మోసానికి కళ్లెం


పెద్దాపురంలో ప్రైవేటు దుకాణంలోని విత్తనాలు

పెద్దాపురం: ఖరీఫ్ పనులు ముమ్మరమవుతున్నాయి. ప్రైవేట్ దుకాణాల్లోనూ విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. నకిలీ విత్తనాలతో అన్నదాతలు మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ సందర్భాల్లో విత్తన చట్టంపై అవగాహన ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చట్టం ద్వారా విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటారు.

చట్టం ప్రయోజనం

విత్తన చట్టం-1966. విత్తన నిబంధనలు-1968. విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 తదితర చట్టాల ద్వారా విత్తనాల విక్రయంలో అతిక్రమణలు, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవచ్చు. మోసానికి గురైన రైతులు 1983 క్లాజ్ 3 ప్రకారం ఆయా దుకాణాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరకుల చట్టం-1955 సెక్షన్-ఏ ప్రకారం జరిమానా విధిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వెయ్యికి పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి.

స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తనాల దుకాణాల్లో నిల్వబోర్డు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. లేకుంటే 1983 క్లాజ్ 8 ప్రకారం చర్యలు తీసుకోవడమో, లైసెన్సు రద్దు చేయడమో చేస్తారు.

లేబుల్ లేకపోతే ..

ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు విక్రయించే సమయంలో బస్తాలపై సరైన లేబుల్ లేకుంటే విత్తన చట్టం-1966 సెక్షన్-7 ప్రకారం జప్తు చేయొచ్చు. అత్యవసర సరుకుల చట్టం-1955 సెక్షన్-7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే విత్తన చట్టం-1960 సెక్షన్-7ప్రకారం నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజు 8ను అనుసరిస్తూ డీలర్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు.

రశీదు ఇవ్వకుంటే..

విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు దుకాణదారులు కచ్చితంగా రశీదు ఇవ్వాల్సిందే. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజ్-9 ప్రకారం నోటీసు ఇవ్వడం, దానికి సమాధానం ఇవ్వకుంటే లైసెన్స్ రద్దు చేస్తారు.

లైసెన్స్ ప్రదర్శించాల్సిందే..

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. 1983 చట్టం క్లాజు-5 ప్రకారం లైసెన్స్ రద్దు చేయవచ్చు.

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రభుత్వం పొందుపర్చిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తన డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణ లైసెన్సు పోగొట్టుకునే పరిస్థితి ఉంది.

–దైవకుమార్, ఏడీఏ, పెద్దాపురం

కలుషిత జలాలు సముద్రంలోకి తరలింపు


చానల్ ద్వారా నీరు వదులుతున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో కాలుషిత జలాలను అధికారులు మంగళవారం సముద్రంలోకి విడిచిపెట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ సూచన మేరకు లాక్ సూపరింటెండెంట్ కరణం సత్యనారాయణ లాకుల్లోని ఒక చానల్ ద్వారా నీటికి విడుదల చేయించారు. కొన్నేళ్లుగా గేట్లు మొరాయించడంతో మురుగునీరు లాకుల వద్ద పేరుకుపోయిన విషయం తెలిసిందే. ఈ నీటిని తరలిస్తే కానీ సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే ఫిల్టరేషన్ చెరువులోకి గోదావరి నీరు చేరదు. కాకినాడ కార్పొరేషన్, నాగార్జున ఫ్యాక్టరీ అధికారులు గోదావరి కాలువలోని నీటి నమూనాలను తీసి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

పార్టీ రహితంగా సంక్షేమం


గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజా సమస్యలు వింటున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : రాష్ట్రంలో పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా మంగళవారం మండలంలోని కొండపల్లి గ్రామంలో సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కేశారపు అయ్యన్న, పోకనాటి దుర్గారావు, ధనయ్యలతో కలిసి దవులూరి గడప గడపనూ సందర్శించారు. వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, ఎస్ఎంసీ చైర్మన్ పోకనాటి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- జగ్గయ్య చెరువులో గడప గడపకూ మన ప్రభుత్వం


పిఠాపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా అది కేవలం ప్రజా సంక్షమమే ధ్యేయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణం జగ్గయ్య చెరువు కాలనీ 11వ వార్డు సచివాలయం పరిధి 20వ వార్డులో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించారు. ఆయా ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయి, వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలను రద్దు చేస్తామంటున్నారంటే టీడీపీ నాయకులకు ప్రజల చెంతకు పాలన వెళ్లడం ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రజల చెంతకే పాలనను తీసుకురావడం కోసమే గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. ఈ పథకాలన్నీ మళ్లీ అమలు జరగాలంటే జగనన్న మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగ్గయ్య చెరువు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వారి సేవలు ప్రశంసనీయం
- వలంటీర్లకు దవులూరి సత్కారం


పీబీ దేవంలో వలంటీర్లను సత్కరించిన దొరబాబు, ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు ప్రజలకు నేరుగా అందాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు దొరబాబు తెలిపారు. కోవిడ్ కాలంలో వలంటీర్లు చేసిన సేవలు ప్రశంసనీయమని, ప్రజల అవసరాలను ప్రభుత్వానికి, ప్రభుత్వ పథకాలు ప్రజలుకు అందజేస్తున్న వారి సేవలు ఎనదగినవని అన్నారు. దీంతో వారి సేవలకు గుర్తింపుగా ఏటా వారిని సత్కరించాలని సీఎం జగన్ నిర్ణయించారని దొరబాబు అన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షలాది కుటుంబాలకు మేలు జరిగిందని, ఈ వ్యవస్థకు అనుబంధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందజేస్తున్నట్టు తెలిపారు. సచివాలయ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత సీఎంకే దక్కుతుందని అన్నారు. అటువంటి ముఖ్యమంత్రిని తిరిగి ఎన్నుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సుమారు 38 ఏళ్ల తరువాత మొట్ట మొదటిసారిగా స్థానికుడైన తనకు పెద్దాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం సీఎం జగన్ కల్పించారని దొరబాబు తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి తీరుతామన్నారు.

ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు చేసే వారిని ముఖ్యమంత్రిగా ఎన్నుకొవాలని, నియోజకవర్గం నుంచి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీడీఓ డి.లలిత గ్రామంలో పురస్కారాలు అందుకునే వలంటీర్ల వివరాలను తెలియజేశారు. సీనియర్ ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, తహసీల్దార్ ఏఎల్‌వీ కుమారి, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, వైఎస్సార్ సీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకే కల్వర్టు నేలమట్టం

- గత పంచాయతీ పాలకుల నిర్వాకం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు


వేట్లపాలెం కందపేట ప్రధాన డ్రైనుపై కూలిన కల్వర్టు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలోని కందపేటలో నిర్మించిన కల్వర్టు నాలుగు రోజుల క్రితం కూలిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు వేట్లపాలెం నుంచి గోదావరి కాలువలో కలుస్తుంది. ఈ కాలువపై గత పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మించారు. నాలుగు రోజుల క్రితం వాహనం వెళ్తుండగా ఇది కూలిపోయింది. ప్రధాన డ్రైనుపై మూడు కానులతో కల్వర్టు నిర్మించారు. నిర్మాణం నాశిరకంగా ఉండడం వల్లే ఇది కూలిపోయిందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తూ పంచాయతీ కార్యదర్శి మోసేకు ఫిర్యాదు చేశారు. శ్లాబులో ఐరెన్ వాడకపోవడం వల్లే ఇలా జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గోలి బాబ్జీ డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు పెట్టాలని ఆయన అన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ


పొలంలో సర్వే చేస్తున్న అధికారులు

కరప: కలెక్టరేట్ స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్ తదితరులు విచారణ నిర్వహించారు. మండలం వేళంగి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి రుక్మణమ్మకు చిన మామిడాడ సమీపంలో సర్వేనంబరు 18/5లో 83 సెంట్ల పంటపొలం ఉంది. ఈ పొలానికి సరిహద్దులో పుంతమార్గం పక్కన చుండ్రు రామకృష్ణ ప్రసాద్‌కు అదే సర్వే నంబరుతో 17 సెంట్ల భూమి ఉంది. అయితే రుక్మణమ్మ తన పొలానికి పుంత మార్గానికి మధ్య భూమిని 1950 నుంచి ఆక్రమించుకున్నారని, తన పొలానికెళ్లే దారి లేకుండా పోయిందని, న్యాయంచేయాలని కోరుతూ కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా స్పందించి ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు, కరప పోలీసుస్టేషన్‌కు పంపించారు. దీంతో మంగళవారం అధికారులు రుక్మణమ్మ, సరిహద్దుదారులైన రామకృష్ణ ప్రసాద్‌ను తహ సీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపారు. సర్వేనంబరు 18/5లోని పొలాన్ని సర్వే చేశామని, రెవె న్యూ రికార్డుల ప్రకారం రుక్మణమ్మ పేరన 83 సెంట్లభూమి, రామకృష్ణప్రసాద్‌పేరన 17 సెంట్లభూమి ఉందని, రీసర్వేలో కూడా రికార్డుల ప్రకారం సరిపోయిందని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. అయినా రుక్మణమ్మ అంగీకరించకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఇ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, డీటీ సురేష్, ఏఎస్ఐ ప్రసన్నకుమార్ ఇరువురుని తీసుకెళ్లి వారి ఎదుటే సర్వేచేసి ఆమెకు సరిహద్దులోని భూమి ఆక్రమణ జరగలేదని, రామకృష్ణ ప్రసాద్‌పూర్వీకుల పేరనే 1956 నుంచి 17 సెంట్లు ఉందని వివరించారు. దీనికి రుక్మణమ్మ అంగీకరించక కోర్టులోనే తేల్చుకుంటానన్నారు.

ఆలయ అవసరాలకే మట్టి వినియోగం

- పురావస్తుశాఖ సీఐ మూర్తి
- కోనేరులో పూడికతీత పరిశీలన

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరులో పూడికతీత పనులను పురావస్తుశాఖ సీఐ కేవీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం పరిశీలించారు. 'చురుగ్గా కోనేటి పూడిక తీత' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పురవాస్తు శాఖ అధికారులు స్పందించారు. కోనేరులో తీసిన మట్టిని బయట వ్యక్తులకు తరలిస్తున్నారనే కథనం మేరకు చెరువులో పూడికతీతను సీఐ పరిశీలించి అనంతరం ఆలయ ఈఓ డి.నాగ మల్లేశ్వరరావుతో చర్చించారు. ఆలయానికి చెందిన విశ్రాంతి భవనం వద్ద మట్టి అవసరం ఉందని, అక్కడ మట్టి వేయకుండా బయటకు తరలిస్తున్నారని సీఐ మూర్తికి ఈఓ తెలిపారు. దాంతో విశ్రాంతి భవనం వద్ద కావలసిన స్థాయిలో మట్టి వేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. దాంతో మంగళవారం నుంచి విశ్రాంతి భవనం వద్ద మట్టి తోలనున్నట్టు ట్రస్టు బోర్డు సభ్యుడు చల్లా సత్తిబాబు సాక్షికి తెలిపారు.

వైభవంగా పూజలు, హోమాలు


ఆలయంలో నిర్వహిస్తున్న దేవాతా హోమం

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద వేంచేసి ఉన్న ఉమా మార్కెండేయేశ్వర సహిత భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వేదపండితులు దేవులపల్లి ఫణి రామకృష్ణ శర్మ, అల్లకి వెంకటజోగేశ్వరశర్మ, చేబ్రోలు వెంకట సూర్యసుబ్రహ్మణ్యప్రసాద్, సాయి నాగప్రసన్న గణపతి మార్కెండేయ శాస్త్రిల ఆధ్వర్యంలో యాగశాల ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాబంధన, దీక్షధారణ, అఖండ దీపారాధన, దేవాతా హోమాలు జరిగాయి. బుధవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, యంత్రజపాలు, సూర్యనమస్కారాలు, దేవతా హోమాలు జరుగుతాయని నిర్వాహకులు గిడుతూరి శ్రీనివాసరావు, బడిగంటి రాంబాబు, నాగేశ్వరరావు, మొండి బాబి, కట్ట వెంకటబద్దరావు, సప్పా రామారావు, కట్టా త్రిమూర్తులు, వానపల్లి వీరబాబు తెలిపారు. గురువారం శివలింగం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంజీవ ఆంజేయస్వామి, చండీశ్వర విగ్రహలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతాయని తెలిపారు.

బదిలీల వేళ నియామకాలేల

- డీఎంహెచ్‌ఓ, ఏఓలను కలసిన ఏపీ ఎన్‌జీఓ నేతలు
- వివాదాస్పదమవుతున్న పాత ప్రకటనపై భర్తీలు


అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న ఎన్‌జీవో నాయకులు

కాకినాడ క్రైం: బదిలీలు జరుగుతున్న సమయంలో స్థానిక ఖాళీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాత నియామక ప్రకటన ద్వారా భర్తీ చేయడం వివాదాస్పదమవుతోంది. ఈ చర్యపై ఏపీఎన్‌జీవో ముఖ్య నేతలు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రోణంకి రమేష్, ఇన్‌చార్జి ఏవో సూర్యచంద్రను కలిసి మంగళవారం సాయంత్రం తమ అభ్యంతరం తెలిపారు. ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న ఎందరో ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై నిషేదం ఎత్తివేసిందని ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు తెలిపారు. గత నోటిఫికేషన్‌లను ఈ సమయంలో తెరమీదికి తెచ్చి ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టుల భర్తీ ప్రారంభించడం సబబు కాదన్నారు. డీఎంహెచ్‌వో అధికారుల ఏకపక్ష నిర్ణయం వల్ల ప్రభుత్వం ఉద్యోగులకు అందిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకోలేని దుస్థితి ఎదురైందని అన్నారు. నూతన బదిలీలతో నిర్ణీత ఖాళీలు భర్తీ చేస్తే ఎదురు చూస్తున్న ఉద్యోగులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బదిలీల ప్రక్రియ ముగిసే వరకు నియామక ప్రక్రియ పునః ప్రారంభించడాన్ని నిలిపివేయాలని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునే ప్రయత్నం

కొత్తపల్లి: తొండంగి మండలం పెరుమళ్లపురంలో బల్కుడ్రగ్ కంపెనీ నిర్మాణం కోసం మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణను అధికారులు చేపట్టారు. ఈ సేకరణను అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే వర్మ టీడీపీ కార్యకర్తలు ప్రయత్నించగా మూలపేటలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆందోళన నెలకొంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్మను అరెస్టు చేసి పూచికత్తిపై విడుదల చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కారుణ్య నియామకాలు ఇప్పించండి


ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ యువతీ యువకులు

కాకినాడ రూరల్: జిల్లా పరిషత్‌లో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు విద్యార్హత సరిపోలేదని ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇవ్వలేనందున తక్షణమే కారుణ్య నియామకాలు ఇప్పించాలని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా పరిషత్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన వారి కుటుంబ సభ్యులు రాజీవ్‌నాయకర్, దుర్గ, దీపిక, నోయల్ జాన్సన్ తదితరులు వినతి పత్రం అందజేయడంతో న్యాయం జరిగేలా చూస్తానని కన్నబాబు హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ పోస్టులకు 9 లోగా దరఖాస్తు చేసుకోవాలి

కరప: తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కరప మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు, అర్హులైనవారు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పెదకొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ జనరల్), కరప-7లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-బి), కూరాడ-1లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-ఏ), కరప-8లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-డీ), రిజర్వ్ చేయబడ్డాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకుని అర్హులైనవారు దరఖాస్తు చేయాలని, సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికచేయడం జరుగుతుందని సీడీపీఓ తెలిపారు.